పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు దుస్తులు, సోపులు పంపిణీ చేసినట్లు పంచాయతీ ఇఒ గురుమోహన్ తెలిపారు. మంగళవారం పంచాయతీలో పనిచేస్తున్న 115 మంది కార్మికులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడతగా కార్మికులకు దుస్తులు, సోపులు, కొబ్బరి నూనె, గ్లౌజులు పంపిణీ చేశామ న్నారు. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పంచాయతీ ప్రజలు ఆరోగ్యాంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నౌషద్, వార్డు సభ్యులు ఉదయ్ కుమార్, మల్లికార్జున రెడ్డి, తెలుగుదేశం పార్టీ బీసీ రాష్ట్ర నాయకులు పురం రామ్మూర్తి, కంచు సూరి, సచివాలయ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఇఒ

కొప్పర్తిలోనే ఎంఎస్ఎంఇ పార్క్!

- కూటమి సర్కారుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఝలక్
- మూడ్రోజుల్లో కేంద్ర కన్సల్టెన్సీ పర్యటన
- త్వరలో ఫీజుబిలిటీ రిపోర్టు అందజేత

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎట్టకేలకు కొప్పర్తి పారిశ్రామికవాడలోనే ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు కానుంది. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటుకు ముందుకు కదిలింది. ఇటీవల కొప్పర్తి ఎంఎస్ఎంఇ పార్కు పూర్వాపరాలను పరిశీలిస్తే 2023 డిసెంబర్ 20న అప్పటి వైసిపి సర్కారు జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామికవాడలోని 20 ఎకరాల్లో రూ.200 కోట్లతో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు జిఒ ఎంఎస్ నెంబర్ 129 జారీ చేసింది. అనంతరం ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఈలోపు సార్వత్రిక ఎన్నికలు రావడంతో భవన నిర్మాణాలు, ఇతర సాంకేతిక యంత్రాలు అమరిక తదితర ఏర్పాట్ల ప్రక్రియ నిలిచి పోయింది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి అధికారం చేతులు మారింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన వెంటనే కొప్పర్తిలోని ఎంఎస్ఎంఇ పార్కును రాజధానికి తరలిస్తూ జిఒఎంఎస్ నెంబర్ 56 జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు వ్యక్తం కావడం తెలిసిందే. రాష్ట్రంలోని కూటమి సర్కారు నిర్వాకానికి కేంద్రం సహాయ నిరాకరణ చేసినట్లు తెలుస్తోంది. కొప్పర్తి పారిశ్రామికవాడలోనే ఎంఎస్ఎంఇ పార్కును ఏర్పాటు చేయడం ఖాయమని తేలిపోయింది. కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి పారిశ్రామికవాడ అభివృద్ధి వైపు దృష్టి సారించింది. మూడ్రోజుల వ్యవధిలో గ్రాంట్ ఆథర్టన్ ఆధ్వర్యంలోని కన్సెల్టెన్సీని కొప్పర్తి పారిశ్రామికవాడను సందర్శించాలని ఆదేశించింది. కన్సెల్టెన్సీ పారిశ్రామికవాడలోని సదుపాయాలను పరిశీలించి ఫీజుబిలిటీ రిపోర్టును ఇవ్వనున్నట్లు సమాచారం. రిపోర్టు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి పారిశ్రామికవాడలో ఎంఎస్ఎంఇ పార్కును ఏర్పాటు చేయనుంది. కేంద్రం కొప్పర్తి పారిశ్రామికవాడను ఎంపిక చేసుకున్న సంగతి తెలిసిందే. అనంతరం కొప్పర్తి పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాలు, పరిశ్రమలను ఏర్పాటు చేయడంతోపాటు ఇంజినీరింగ్ విద్యార్థులకు సాకేంతిక సామర్థ్యాలను సంతరించుకు నేందుకు శిక్షణా సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది.

సచివాలయాల్లో మెరుగైన ఆధార్ సేవలు

- డిఆర్ఒ మధుసూదన్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ మధుసూదన్‌రావు

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఆధార్ నమోదు శాతం పెంచేందుకు అధికారులు అందరూ సమన్వయంగా కృషి చేయాలని, సచివాలయాల్లో మెరుగైన ఆధార్ సేవలు అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డిఆర్ఒ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ సమీకరణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధార్ స్టేట్ రీజనల్ కార్యాలయ సహాయ మేనేజర్ కె.దామోదర్ జిల్లాలో ఆధార్ నమోదు ప్రగతి, 0-5 పిల్లల నమోదు, మొబైల్ బయోమెట్రిక్ యూనిట్లు, నమోదు సందర్భంగా తిరస్కరణకు గురవుతున్న అంశాలు, సాంకేతిక సమస్యలు తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు. ఆయా అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం డిఆర్ఒ మధుసూదన్‌రావు మాట్లాడుతూ జిల్లాలో సచివాలయాలు, పోస్ట్ ఆఫీస్‌లు, బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్, ఇతరత్రా మొత్తంగా 212 ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. సచివాలయాలు, పోస్టాఫీసు, బ్యాంకులలో ఆధార్ నమోదు శాతాన్ని పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. సచివాలయాల్లో ఆధార్ సేవలు మెరుగు పరచాలని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. 0-5 వయసున్న పిల్లల నమోదులో దాదాపు 28 వేలకు పైబడి పెండింగ్ ఉన్నాయని చెప్పారు. వీటన్నింటినీ నమోదు అయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలో కూడా మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహించాలని సూచించారు. జిల్లాలో కెవిపల్లి, తంబళ్లపల్లి, వీరబల్లిలలో ఆధార్ కేంద్రాలు లేవని, అక్కడ కేంద్రాల ఏర్పాటుకు బ్యాంకులు ముందుకు రావాలని సూచించారు. ఆధారు నమోదు సమయంలో తప్పులు లేకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి ఆధార్‌ను అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. ఈ మేరకు ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాసులు, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి, డిఇఒ సుబ్రహ్మణ్యం, ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి అధికారి రమాదేవి, ఎల్‌డిఎం ఆంజనేయులు, పోస్టల్ శాఖ అధికారులు, వివిధ బ్యాంకర్లు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, సిఐ

నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : నేరాల నియంత్రణలో సిసి కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని చిప్పిలి సర్పంచ్ పసుపులేటి చలపతి అన్నారు. మంగళవారం చిప్పిలిలో సర్పంచ్ చలపతి ఆధ్వర్యంలో ప్రజలకు తాలూకా సిఐ కళా వెంకటరమణ సిసి కెమెరాలపై అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ దొంగల నుండి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే ముందు పోలీసులను సంప్రదించి సమాచారం ఇవ్వాలన్నారు. ఇళ్లకు, దుకాణాలకు, సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా చోరీలను అరికట్టవచ్చునని, దొంగతనాలకు పాల్పడే వారిని సంఘటనా స్థలంలోనే పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా వేసవిలో దొంగల బారి నుండి జాగ్రత్తగా ఉండాలని పలు సలహాలు, సూచనలు చేశారు. నేరాల నియంత్రణలో ప్రజలు సహకరించాలని కోరారు. ఈ అవగాహనా కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది చిప్పిలి హరి, చిప్పిలి కృష్ణారెడ్డి, నక్కలదిన్నె మేస్త్రి శ్రీనివాస్, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: క్రమశిక్షణ, పట్టుదల విద్యార్థుల విజయానికి సోపానాలని, ఒత్తిడిని అధిగమించి విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని బ్యాంక్ ఆఫ్ బరోడా అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డి, ప్రముఖ మోటివేషన్ స్పెషలిస్ట్, హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి, నందిని పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బూన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో మోటివేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వీరు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు నిర్ధిష్ట ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ఆత్మస్థైర్యం, స్వేచ్ఛగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఓర్పు, సహనం, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను చక్కగా అవగాహన చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం కరస్పాండెంట్ శంకర్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో తమ విద్యార్థులకు ప్రేరణ కలిగించే ప్రసంగాలతో స్ఫూర్తి నింపిన కోటిరెడ్డి, రామ్మూర్తిలకు కృతజ్ఞతలు తెలిపారు. వారి ప్రసంగాలను స్ఫూర్తిగా చేసుకుని విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను మోటివేట్ చేస్తున్న కోటిరెడ్డి

మృతి చెందిన ఖైదీ కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పీలేరు

2022లో పీలేరు సబ్ జైల్లో ఆత్మహత్య చేసుకున్న ఖైదీ కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం మంజూరైనట్లు తహశీల్దారు భీమేశ్వరరావు తెలిపారు. పీలేరు మండలం, యర్రగుంటపల్లె పంచాయతీ, ముడుపులవేములవారిపల్లెకు చెందిన మూడే రాజేష్ నాయక్ (30) 2022 మార్చి 29న పోక్సో కేసులో అరెస్టయి పీలేరు సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా చేరాడు. 2022 జూలై 08న సబ్ జైల్లో అతను ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి ఎక్స్గ్రేషియా చెల్లించడం కోసం మంగళవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు సబ్ జైలు సూపరింటిండెంట్ కె.చంద్రశేఖర్, తహశీల్దార్ భీమేశ్వరావు మృతుడి కుటుంబ సభ్యులను పిలిపించి వారి వివరాలను నమోదు చేసి, జిల్లా కలెక్టరుకు నివేదిక పంపనున్నట్లు తహశీల్దారు తెలిపారు. త్వరలో రూ.5 లక్షల ఎక్స్‌గ్రేసియా చెక్కును బాధిత కుటుంబానికి అందజేయనున్నట్లు చెప్పారు.

మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తహశీల్దారు

తాగునీటి లభ్యతపై దృష్టి సారించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ఆర్‌డబ్ల్యుఎస్ వన్ యాప్‌ను ఉపయోగించుకుని అవసరమైన ప్రదేశాలలో తాగునీటి సరఫరా చేయాలని, నీటి నాణ్యత, సకాలంలో నీటి లభ్యత వంటి అంశాలపై దృష్టి సాధించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని అన్ని మండలాల ఎంపిడిఒలు, గ్రామీణ నీటి సరఫరా శాఖ సిబ్బంది, పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది తదితరులతో వేసవికాలంలో నీటి సరఫరాపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో దాదాపు 536 నివాసాలలో నీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని, ఈ ప్రాంతాలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నీటి సరఫరా చేసే ట్రిప్పులను ఆర్‌డబ్ల్యుఎస్ వన్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. మంచినీటి సరఫరా చేయడమే కాకుండా నీటి నాణ్యత, అవసరమైన సమయానికి నీటిని అందించడం వంటి అంశాలపై వాటిపై దృష్టి సారించాలన్నారు. ఏ ప్రాంతాలలో కొరత ఏర్పడుతుందో ముందే అంచనా వేసుకుని ఆ ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. అనంతరం జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారి ప్రసన్నకుమార్ ఆర్‌డబ్ల్యుఎస్ వన్ యాప్ ఎలా వినియోగించుకోవాలి, నీటి సరఫరాకు అవసరమయ్యే మరమ్మత్తులు, జియో ట్యాగింగ్ తదితర అంశాలపై ఎంపిడిఒలకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసన్నకుమార్, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి, అన్ని మండలాల ఎంపిడిఒలు, తదితర, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రీస్కూల్ పిల్లల అభివృద్ధికి చర్యలు : పీడీ

విద్యార్థులకు ఆటలు నేర్పుతున్న పీడీ రమాదేవి

ప్రజాశక్తి-పీలేరు

పూర్వ పాఠశాల విద్యార్థుల మానసిక, శారీరక, విద్యార్థి కోసం అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రమాదేవి తెలిపారు. మంగళవారం పీలేరు పట్టణం, ఆర్టీసీ నల్లగుట్టలోని అంగన్వాడీ కేంద్రాన్ని పీడీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని స్టాక్ రిజిస్టర్లను, విద్యార్థుల హాజరు పట్టిని, వారి విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆటపాటలతో చిన్నారులను ఉత్సాహపరిచారు. పిల్లల వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుతూ పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కేంద్రానికి వచ్చిన చిన్నారుల తల్లులకు సూచించారు. ఈ సందర్భంగా కలిసిన మీడియాతో ఆమె మాట్లాడుతూ అన్నామయ్య జిల్లాలో మొత్తం 2,275 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, వాటిల్లో 1,858 ప్రధాన అంగన్వాడీ కేంద్రాలు, 417 మినీ అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయని అన్నారు. అందులో 1,030 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 795 కేంద్రాలు అద్దె భవనాల్లో, 450 కేంద్రాలు ఉచిత భవనాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 9,260 మంది గర్భిణులు, 8,323 మంది చనుబాలు పట్టే తల్లులు అంగన్వాడీ సెంటర్ల ద్వారా పౌష్టికాహారం, ఇతర సేవలు అందుకుంటున్నారని పేర్కొన్నారు. 7 నెలల పసికందు నుంచి 3 సంవత్సరాల వయస్సు పిల్లలు 53,022 మంది, 3 నుండి 6 సంవత్సరాల వయస్సు బాలులు 42,037 మంది అంగన్వాడీ కేంద్రాలకు హాజరై పౌష్టికాహారాన్ని స్వీకరిస్తూ, పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నారని తెలియజేశారు. చిన్నారులకు ఆటపాటల ద్వారా అందిస్తూ వారి మానసిక, శారీరక, ఆరోగ్య అభివృద్ధికి తమ సిబ్బంది పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ రాజమ్మ, సూపర్వైజర్ స్వరూప, అంగన్వాడి వర్కర్లు అఖిల, అనిత, సహాయకులు, విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆటో డ్రైవర్లు, ఇతర మోటార్ కార్మికులకు ప్రభుత్వం వాహన మిత్ర ద్వారా వెంటనే రూ.15 వేలు ఇవ్వాలని, జిఒ నెంబర్ 21, 31 రద్దు చేయాలని ఎఐటియుసి నాయకులు సాంబశివ, ముబారక్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం ఆర్‌ఆర్ స్ట్రీట్ ఆటోస్టాండు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర ద్వారా రూ.15 వేలు ఇస్తామని, భారీగా జరిమానాలు విధించే జిఒ 21, 31లను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, డీజిల్, పెట్రోల్ తగ్గిస్తామని చెప్పారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఇప్పటికి 9 నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలు నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయివేట్ ఫైనన్సర్లు చేస్తున్న అధిక వడ్డీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ, పంచాయతీలలో ఆటోలు నిలుపుకోవడానికి పార్కింగ్ స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఆటో డ్రైవర్లకు ఇంటి స్థలాలు ఇచ్చి, ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి పట్టణ కార్యదర్శి తిరుమల, ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేష్, మస్తాన్, గంగులప్ప, మహబూబ్ బాషా, మస్తాన్ ఖాన్, జుబేర్ ఖాన్ పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగాన్ని బలోపేతం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లాలో వైసిపి యుజన విభాగాన్ని పటిష్టం చేయాలని మదనపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిస్సార్ అహమ్మద్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలో యువజన విభాగం సంబంధించి పలు అంశాలను చర్చించారు. రాష్ట్ర, జిల్లా యూత్ కమిటీ, నియోజకవర్గంలో యువజన విభాగం బలోపేతం చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. యువతను పార్టీ వైపు ఆకట్టుకొనే విధంగా ప్రత్యేక కార్యాచరణతో త్వరలోనే క్షేత్రస్థాయి నుంచి కార్యక్రమాలను చేపట్టేవిదంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనంత మునిశేఖర్, కో-ఆప్షన్ సభ్యులు శారద, కొత్తపల్లి మహేష్ బాబు, కొత్తిండ్లు హబీబ్ పాల్గొన్నారు.

జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి

8న మదనపల్లెలో మెగా జాబ్‌మేళా

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం ఎపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని మదనపల్లిలోని శ్రీ శ్రీనివాస డిగ్రీ కళాశాలలో మెగా ఉద్యోగా మెళ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. ఈ ఉద్యోగ మేళ ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగ మేళలో టెక్ మహీంద్రా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఏజిల్ ఎయిర్పోర్ట్ సర్వీసెస్, అడక్కో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఆధ్య హెచ్‌ఆర్ సొల్యూషన్స్, నియో లింక్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, బిగ్ సి, ఫోన్ పే ఫ్లిప్ కార్ట్, అపోలో ఫార్మసీ తదితర కంపనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని ఆసక్తి, ఉన్న యువతీ యువకులు ఈ కింది ఉద్యోగామేళాను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. శ్రీనివాస డిగ్రీ కళాశాల ఉద్యోగమేళా నిర్వహిస్తున్నారన్నారు, ఆసక్తిగల అభ్యర్థులు కింద తెలుపబడిన లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. https://naipunyam.ap.gov.in/user-registration మరిన్ని వివరములకు 6301612761,9553202509,9741432931, 8897776368 నంబర్లను సంప్రదించగలరని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రర్, డిఆర్‌డిఎ, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ పాల్గొంటారన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి చేయూత

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట జోలీబజార్ సమీపంలో ఇటీవల బస్సు ఢీకొని గాయపడి కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకొని డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చిన హమాలి షేక్ సాదక్‌ను రాజంపేట పాత బస్టాండు మసీదు అధ్యక్షులు సయ్యద్ గౌస్ బాషా మంగళవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో సాదక్‌కు ఎడమ చేయి విరగి రెండు శస్త్ర చికిత్సలు జరగడం వలన ఉపాధి కోల్పోవడంతో సాదక్ ఆర్థిక ఇబ్బందులను అర్థం చేసుకున్న మసీదు ప్రెసిడెంట్ గౌస్ బాష 25 కిలోల సోనామసూర బియ్యం బస్తా, కిలో కంది బేడలు, కిలో గోధుమపిండి, చక్కెర, నూనె, సేమియాలు తదితర నిత్యావసర వస్తువులతో పాటు సాదక్ దంపతులిరువురికి నూతన బట్టలను అందజేశారు. ఈ సందర్భంగా గౌస్ బాషా మాట్లాడుతూ సాదగ్ త్వరగా కోలుకోవాలని, అప్పటివరకు ఆ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మసీదు పెద్దలు ఎస్.జి.ఈనాయతుల్లా, ఎస్.ఎం.డి కరీం, పి.మోసిన్ ఖాన్, అడ్వకేట్ ముజఫర్ అహ్మద్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేస్తున్న గౌస్‌బాషా

మహిళలను గౌరవించడం మన సంప్రదాయం

- ఎఎస్‌పి ఎం.వెంకటాద్రి

ప్రజాశక్తి - రాయచోటి

సమాజంలో మహిళలను గౌరవించడం మన సాంప్రదాయమని అడిషనల్ (అడ్మిన్) ఎస్‌పి ఎం.వెంకటాద్రి పేర్కొన్నారు. మంగళవారం జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల రాయచోటిలో నిర్వహించిన మహిళా సాధికారత కార్యక్రమానికి హాజరయ్యారు. శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ సిఐ ఐ. రవి శంకర్ రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది, పీలేరు, సంపేపల్లి, రామాపురం నుండి విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎఎస్‌పి వెంకటాద్రి మాట్లాడుతూ మహిళల సాధికారతలో పోలీసు సిబ్బందికి ఉన్న కీలక పాత్రను వివరించారు. మహిళలు తమ భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని తెలిపారు. అన్యాయాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని, దుర్మార్గులను సమాజంలో ఎదుర్కొనేలా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, స్త్రీలను గౌరవించడం మన భారతీయ సంప్రదాయంలో ప్రధాన అంశమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించడమే కాకుండా, వారిని సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఉమెన్స్ సెల్ కో-ఆర్డినేటర్ విశాలాక్షి, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సునీత, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం పొందిన మహిళలతో ఎఎస్‌పి వెంకటాద్రి

రైతులకు సూచనలు ఇస్తున్న ఎఒ నాగమణి

ప్రతి రైతూ ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

రబీ సీజన్‌న్ పంటలు సాగుచేస్తున్న రైతులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వై.నాగమణి తెలిపారు.మండలంలోని కుమ్మరపల్లి, బండపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగుచేసిన పంటల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇ క్రాప్ సాగు నమోదు చేసిన పంటలను రైతులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు. వ్యవసాయపరంగా ప్రభుత్వ పథకాలు పిఎం కిసాన్, పంట రుణాలు, పంట సబ్సిడీలు, పంటల బీమా, వ్యవసాయ అనుబంధ రుణాలు లాంటి పథకాలు పొందాలంటే రైతు సేవ కేంద్రాలలో రైతు భూమి పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు , ఫోన్ నెంబర్ ఇచ్చి రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ ప్రపంజని రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులు, మెకానిక్‌లకు అవగాహన కల్పిస్తున్న కంపెనీ మేనేజర్ రాజేష్

రైతులకు అండగా టెక్స్‌మో

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రైతులు మెచ్చే సేవలందిస్తూ ఎన్నో ఏళ్లుగా వారికి విశ్వసనీయమైన నేస్తంగా టెక్స్ మో కంపెనీ నిలిచిందని ఆ కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు.మంగళవారం పట్టణంలోని రంగసముద్రం రోడ్డులో గల కొండా పంక్షన్ హాల్లో మండలంలోని బోరుబావి మోటర్ల టెక్నీషియన్లు, మెకానిక్‌లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా టారో టెక్స్ మో కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ రాజేష్, సీనియర్ సేల్స్ మేనేజర్ రాజేష్, సీనియర్ సర్వీసెస్ ఇంజనీర్ సూర్యప్రకాష్ టారో టెక్స్ మో కంపెనీ అందిస్తున్న పలు రకాల బోరు, బావి మోటార్లు, వాటి పనితీరు, కంపెనీ అందిస్తున్న వారెంటీ సేవలు, తంబళ్లపల్లె ప్రాంతంలో రైతులకు ఉపయోగపడే మోటార్లపై విస్తృతంగా వివరించి అవగాహన కల్పించారు. నియోజకవర్గంలో కొందరికి టారో కంపెనీ డీలర్‌షిప్ ఇచ్చామని, గతంలో లాగా వారికి సహకారం అందించాలని కోరారు. అనంతరం ఈ ప్రాంత రైతుల మోటర్ల వినియోగం, కంపెనీ ద్వారా అందించాల్సిన సేవలను మెకానిక్ లు కంపెనీ ప్రతినిధులకు వివరించారు. పలువురు మెకానిక్, రైతులను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైతులు, హార్డ్‌వేర్ షాప్ యజమానులు ధర్మ, జైహింద్ బ్రిగేడ్ ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడు సత్తిరెడ్డి, కమిటీ సభ్యులు తుపాకుల క్రాంతి, బోర్వెల్ మెకానిక్‌లుపాల్గొన్నారు.

కోటకొండ తండా ప్రజలతో ప్రమాణం చేయిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

సారా రహిత గ్రామాలతో నవశకానికి నాంది

- ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

సారా రహిత గ్రామాలతో నవశకానికి నాంది పలుకుదామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి పిలుపు నిచ్చారు. మండల పరిధిలోని కోటకొండ తండాలో మంగళవారం సాయంత్రం నవోదయం గ్రామ సభ ములకలచెరువు ఎక్సైజ్ సిఐ మాధవి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర మాట్లాడుతూ సారా రహిత గ్రామాలే లక్ష్యంగా పనిచేసి నవశకానికి నాంది పలుకు దామని గ్రామ ప్రజలతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె తహశీల్దార్ హరికుమార్, ఎంఇఒ త్యాగరాజు, సర్పంచ్ శంకర్‌నాయక్, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌టియు జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్ కోరారు. మైదుకూరు ఎంఆర్‌సి ఆవరణలో మంగళవారం ఎస్‌టియు రీజియన్ సమావేశాన్ని కన్వీనర్ వెంకటేశ్వర రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై 10 నెలలు కావస్తున్నా ఉద్యోగ ఉపాధ్యాయ సమస్య ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు కూశెట్టి పాలకొండయ్య, యాప రాల వెంకటసుబ్బయ్య, ఎస్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు బికె సురేష్, మైదుకూరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, చెన్నకేశవ ప్రసాద్ పాల్గొన్నారు.

'వ్యవసాయ యాంత్రీకరణ'ను సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు రూరల్ : వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని సన్న, చిన్నకారు రైతులకు ఎస్సీ,ఎస్టీ, మహిళా రైతులకు ప్రాధాన్యత కల్పిస్తూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద వివిధ రకాల యంత్ర పరికరాలను సబ్సిడీపై పంపిణీ చేయుటకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

బాలుడి మృతిపై సమగ్ర విచారణ జరపాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరు పట్టణంలో వారాహి ప్రయివేట్ హాస్పిటల్‌లో బాలుడి మృతిపై అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజ వర్గం గండికోటకు చెందిన 12 రోజుల బాలుడు ఆరోగ్యం సరిగాలేదని వారాహి హాస్పిటల్‌లో చేర్పించారన్నారు. హాస్పిటల్ యాజమాన్యం బాధితులతో డబ్బులు కట్టించుకొని తర్వాత బాలుడికి సిరియస్‌గా ఉందని, డబ్బులు పూర్తిగా కట్టించుకొని బాలుడు చనిపోతాడని చెప్పడం దారుణమన్నారు. హాస్పిటల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే బాలుడు చనిపోయడని బాధితులు వాపో తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించక పోవడంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. ఈ మధ్య కాలంలోనే ప్రయివేట్ ఆసుపత్రులపై అనేక ఆరోపణలు వస్తున్నా యన్నారు. బాలుడి మృతిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామ న్నారు. సమావేశంలో మణికంఠ పాల్గొన్నారు.

తగ్గిన వేరుశనగ దిగుబడి..రైతుల్లో ఆందోళన

- గిట్టుబాటు ధరలు లేవు
- అప్పుల ఊబిలో కూరుకుపోయాం
- ప్రభుత్వమే ఆదుకోవాలని రైతుల వేడుకోలు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 2,870 ఎకరాల్లో రైతులు వేరుశనగ పంటను సాగు చేశారు. విత్తనపు కాయలను కిలో రూ.80 రూపాయల లెక్కన 43 కిలోల బస్తాను రూ.3,500 రూపాయలతో కొనుగోలు పంట సాగు చేశారు. సాగు చేసి ఈ చెట్టుకున్న కాయలను ఒలిపించిన తర్వాత మార్కెట్‌లో రైతుకు 43 కిలోల బస్తా రూ.2500లు మాత్రమే ధర పలుకుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు మూడు నెలల పాటు సేద్యం ఖర్చులు, పెట్టుబడి వ్యయం పోయినా కూడా రైతుకే ఒక బస్తా పై వెయ్యి రూపాయలు తక్కువగా ధర పోతుంటే రైతు ఏ విధంగా జీవనం సాగించాలని వాపోతున్నారు. ఉన్న భూమిని వదులుకోలేక సొంతబోరు మోటారు ఉండి వ్యవసాయం చేసుకోలేక కోరుకు గుత్తకు ఇచ్చిన వారి పరిస్థితి కూడా దయనీయంగా ఉంది.

వేరుశనగ కాయలను ఎండబెడుతున్న రైతులు

ఎకరాకు రూ.50 వేలు ఖర్చు

ఎకరాకు యాభై వేల రూపాయలు ఖర్చు చేసి నాలుగు ఎకరాలు వేరుశనగ పంట సాగుచేశాను. ఎకరాకు 30 మూటలు కాయలు కావాల్సి వుండగా కేవలం 15 మూటలే వచ్చాయి. అనుకుంత దిగుబడి రాలేదు. వేరుశనగ పంటతోనైనా లాభాలు పొంది అప్పులు తీర్చుకోవచ్చనే ఆశలు అడియాసలయ్యాయి. మరింత అప్పుల ఊబిలోకి కూరుకుపోయాం. వ్యవసాయాధికారులు పరిశీలించి ఆదుకోవాలి.

-నరసింహులు, ఫకీరారెడ్డిగారిపల్లి

పంట దిగుబడి రాలేదు

వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పంట దిగుబడి తగ్గింది. తెగుళ్లతో పాటు అడవి పందుల బెడదతో కూడా బాగా నష్టపోయాం. అప్పులు చేసి పండించిన వేరుశనగ నష్టాలనే మిగిల్చింది.తక్కువ దిగుబడి, గిట్టుబాటుధర లేకపోవడంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

-బాలప్పనాయుడు, నాయనవారిపల్లి

'ఉపాధి' పనులు కల్పించాలి : పీడీ

ప్రజాశక్తి-రామాపురం

గ్రామాలలో వలసలు వెళ్లకుండా ఉపాధిపనులు కల్పించాలని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లి, నల్లగుట్టపల్లి పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయనపరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మమేకమై ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రామా పురం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కూలీలకు 150 రోజులు పని దినాలు కల్పించిందని అన్నారు. పనుల కోసం గ్రామాలు వదిలి ఎక్కడికి పోవాల్సిన పనిలేదని, మీ గ్రామంలోనే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కనిపిస్తారని పేర్కొన్నారు. కూలికి గిట్టుబాటు అయ్యేవిధంగా పనులు కల్పించాలని మండల ఉపాధి అధికారులకు ఆయన సూచించారు. కూలీల హాజరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఉపాధి హామీ ఎపిఒ పెంచలయ్య, ఇసి శివయ్య, టెక్నికల్‌అసిస్టెంట్, ఫీల్డ్‌అసిస్టెంట్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న పీడీ వెంకటరత్నం

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం ..పూర్తయ్యేదెన్నడో?

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులో గేటు నుంచి బస్టాండ్ వరకు నాలుగు లైన్ల సిసి రోడ్డు నిర్మాణం పూర్తయింది. బస్టాండ్ నుంచి పక్కీరారెడ్డిగారిపల్లె వరకు తారు రోడ్డును సగం వేశారు. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రహదారి వరకు గాలివీడు-రాయచోటి ప్రధాన రహదారిని వదిలేశారు. గతంలో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నిధులు మంజూరు కావడంతో పని ఉన్నంతవరకు నిర్వహించారు. అధికారులు పాలకులు దృష్టి పెట్టి ప్రధాన రహదారిపై ఆగిపోయిన రోడ్డు పనులను తిరిగి పునరుద్ధరించాలని ప్రజలుకోరుతున్నారు.

మధ్యలోనే నిలిచిపోయిన రోడ్డు నిర్మాణం

రోడ్డు నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేస్తే ఎలా?

రోడ్డు నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేశారు. రోడ్డు నిర్మాణం చేపట్టి మధ్యలోనే వదిలేస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అధికారులు అర్థం చేసుకోవాలి. తారు రోడ్డు సౌకర్యమైన కల్పించలేదు. సిసి రోడ్డు సదుపాయం లేదు. కనీసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రోడ్డువరకైనా రోడ్డు మరమ్మతులు పూర్తి చేస్తే ఆ రోడ్డు ముందుభాగం నివాసమున్న మాకు కూడా అనుకూలంగా ఉంటుంది.

-షేక్.లితాయఫ్, గాలివీడు

దుమ్ముతో అల్లాడిపోతున్నాం

అరకొరగా రోడ్డు నిర్మించి మధ్యలోనే నిలిపివేయడంతో వాకిలి తెరిస్తే రోడ్డు పైనున్న దుమ్మంతా ఇంటిలోచేరుతోంది. దుమ్ము దూళితో చాలా ఇబ్బంది పడుతున్నాం. దుమ్ము దూళితో శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నాం. రోడ్డు నిర్మాణాన్ని పూర్తి స్థాయిలో చేపట్ల లేదు. గృహాలు మాత్రం కుషావతినది వరకు ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, గృహాలు ఉన్నాయి. వాహనదారులు తరచు ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్రవాహన దారులు మట్టి రోడ్డు అదుపుతప్పి గాయాలపాల వుతున్నారు. అధికారులు దృష్టి పెట్టి మట్టి రోడ్డు లేకుండా మరమ్మ తులు పూర్తి చేస్తే అటు ప్రజలకు ఇటు వాహనదారులకు అనుకూలంగా ఉంటుంది.

-షేక్.అహ్మద్‌వలి,గాలివీడు

కిశోర వికాసం..భవితకు సోపానం

- జిల్లా శిశు గృహ అధికారి సుప్రియ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

కౌమార దశలో ఉన్న బాల, బాలికలు సాధికారతను సాధించడమే కిశోరి వికాసం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని జిల్లా శిశుగృహ అధికారి సుప్రియ, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతతో పాటు సామాజిక బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ప్రధానంగా 15 నుంచి 18 సంవత్సరాలు మధ్య ఉన్న పిల్లలకు అన్ని రకాలుగా అవగాహన సదస్సులు నిర్వహించి వారిలోని నైపుణ్యాలను తెలియజేయాలని అన్నారు. శిశు గృహ అధికారి మాట్లాడుతూ 15 నుంచి18 సంవత్సరాల వయసులోని బాల బాలికలను రెండు గ్రూపులుగా విభజించాలని అన్నారు. బాలికల కోసం సఖి గ్రూపును, బాలురుల కోసం యువ గ్రూపును ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రూప్‌లోను కనీసం ఐదు నుంచి 14 మంది సభ్యులను చేర్చాలని తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని కూడా గ్రూపులలో చేర్చాలని వివరించారు. ఈ గ్రూపులకు కన్వీనర్‌గా మహిళా సంరక్షణ కార్యదర్శులు, కో-కన్వీనర్‌గా ఎఎన్ఎంలు, సభ్యులుగా ఆశా కార్యకర్తలు ఉంటారన్నారు. పాఠశాలల్లో, కళాశాలలో గ్రూప్‌కి నోడల్ టీచర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. కౌమార దశలోని బాల, బాలికలు సాధికారతను సాధించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. కార్యక్రమంలో జిఎంఎస్‌కెలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుప్రియ

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తిచేసుకోండి :ఎఇ

గృహ లబ్ధిదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎఇ చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

పక్కా గృహ నిర్మాణాలలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఎఇ చంద్రశేఖర్‌రెడ్డి లబ్ధిదారులను కోరారు. మంగళవారం లికిరి-4 సచివాలయం పరిధిలో గల సంతగేట్ వీధి, చిన్న మాలపల్లి రెడ్డివారిపల్లిలో పర్యటించారు. హౌసింగ్ లబ్ధిదారులను కలసి వారు ఏ స్టేజిలో పక్కా ఇల్లు కట్టుకుంటున్నారు, తదుపరి స్టేజిలు ఎందుకు కట్టుకోలేకపోతున్నారని విచారించారు. లబ్ధిదారులకు ప్రస్తుత ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రూ. 50వేలు అదనంగా ఇస్తోందని అన్నారు. సంఘమిత్రలు, వారి గ్రూప్ లీడర్లు, సిసి, ఎపిఎంతో మాట్లాడి రుణాలు ఇప్పించి తదుపరి స్టేజ్‌లు కట్టుకోవడానికి ఆర్థిక పరంగా చేయూత నివ్వడానికి మాట్లాడి సహాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు జిడి.వెంకటేష్, ప్రసాద్, స్వర్ణకుమారి, సల్మా భాను దస్తగిరి పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాల పంపిణీ

ప్రజాశక్తి-ములకలచెరువు : మండలంలో గాలికుంటు వ్యాధి, బ్రుసిల్లా నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పశు వైద్యులు డాక్టర్ నివేదిత ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి బుకాయలకోట, చౌడసముద్రం, కాల వపల్లెలలో పశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలపై పాడి రైతులకు అవగాహన కల్పిం చారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఈనెల 30వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో టీకాల పంపిణీ చేపడ తామని అన్నారు. పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.

5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లింగాల : మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామ సమీపంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సత్యవతమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 6లోగా చేసుకోవాలన్నారు.

పుల్లంపేట : మాట్లాడుతున్న డాక్టర్ సానే శేఖర్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-పుల్లంపేట

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సానే శేఖర్ అన్నారు. ఆయన మంగళవారం పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సమావేశం సందర్భంగా మహిళా ఆరోగ్య కార్యకర్తలుకు, ఆశా కార్యకర్తలకు, ఎంఎల్‌హెచ్‌పిలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ స్త్రీలకు 21, పురుషులకు 25 ఏళ్ల వివాహం చేయాలని అంతకంటే తక్కువ వయసులో వివాహం చేయకూడదని అన్నారు. తక్కువ వయసులో వివాహం చేయడం శారీరకంగా కూడా అనేక అనర్థాలకు దారి తీస్తుందని అన్నారు. ఆడపి ల్లలను మొదట చదివించడం ద్వారా వారి జీవితానికి భద్రత ఏర్పడుతుందని పేర్కొన్నారు. గర్భిణులను తొందరగా నమోదు చేయాలని తద్వారా వారికి రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం అందించవచ్చని అన్నారు. రక్తహీనత వల్ల తల్లి బిడ్డ మరణాలు సంభవించే అవకాశం ఉందని అన్నారు. ముందుగా నమోదు చేయడం వల్ల ఈ రక్తహీనత గుర్తించి వాటికి చికిత్స అందించడం ద్వారా ఆరోగ్యకరమైన బిడ్డను పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మనోజ్ చంద్ర, పిహెచ్‌ఎన్ ఆరోహరమ్మ, సిహెచ్‌ఒ రాజా, సూపర్‌వైజర్‌లు కుమారి, మహేష్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : బి.కొత్తకోట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఈనెల 8వ తేదీ వరకు బేటీ బచావో..బేటీ పడావో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గౌరీదేవి పేర్కొన్నారు. కాండ్లమడుగు సెక్టారు గోళ్లపల్లె జడ్‌పి హైస్కూల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గౌరీదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా లింగ వివక్షత, గర్భస్రావాలను నిరోధించడం,ఆడపిల్లలను ఎదగనిద్దాం ఆడపిల్లలను చదవనిద్దాం వారిని ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జిఎంఎస్‌కెలు తులసీ, ఎస్.కరిష్మా, ఎఎన్ఎం హసీనా, అంగన్వాడీ కార్యకర్తలు టి.అమరావతి,ఎస్.సల్మాభాను,ఎస్.మస్తానీ, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-నందలూరు

నేటి సమాజంలో విద్యార్థులు విద్యతో పాటు అన్నిరంగాలలో రాణించాలని శ్రీ అన్నమాచార్య అకాడమీ హై స్కూల్ కరస్పాండంట్ సమ్మెట శివప్రసాద్, డైరెక్టర్ మాడపూరి హేమలత పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ ఆర్‌కె నాలెడ్జి వారు అబాకస్, వేదిక్ మాథ్స్‌లలో నిర్వహించిన జోనల్‌స్థాయి పోటీలలో శ్రీ అన్నమాచార్య అకాడమీ విద్యా వివిధ కేటగిరిలలో యం.సుబ్రహ్మణ్యం, సివి.తేజశ్రీ, యం.యస్వంత్ ప్రథమ స్థానం, జోయా మెహెక్, జి.లక్షిత్ ద్వితీయ స్థానాలలో నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ సమ్మెట ఉమా మహేష్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఎస్ఆర్ఐటి డిప్లొమా విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో చెన్నైకి చెందిన ప్రముఖ కంపెనీ వీల్స్ ఇండియా లిమిటెడ్ అప్రెంటిస్ ఆర్ ట్రైనీ ఉద్యోగాల నిమిత్తం పాలిటెక్నిక్ ఇఇఇ ఫైనలియర్ విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపల్ పాండురంగన్ రవి తెలిపారు. 18 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఎంపికైన వారికి కంపెనీ తరపున ఆఫర్ లెటర్స్ అందాయన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వేంకటేశ్వర రెడ్డి, హెచ్‌ఒడి లు, అధ్యాపకులు అభిందనందించారు.

అంధత్వ నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రొద్దుటూరు : అంధత్వ నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ మౌనిక సూచించారు. ఎస్‌పిసిఎం రామేశ్వరం పాఠశాలలో మంగళవారం 56 మందికి జిల్లా అంధత్వ నివారణ సంఘం ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఆయా సీజన్‌లో అందుబాటులో ఉండే పండ్లు తీసుకోవాలన్నారు. భోజనంతోపాటు ప్రతిరోజు ప్రభుత్వం ఇచ్చే గుడ్డు, రాగిగంజి, చెక్కీలు తీసుకోవడం వల్ల ఆరోగ్య పుష్టి కలుగుతుందన్నారు. ఇవన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే లభి స్తాయన్నారు. అనంతరం ఆప్తాల్మిక్ అధికారి రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాలలో 10 శాతం మందికి దృష్టిలోపం ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. మేనరికం వివాహాలు అరి కట్టాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు మాట్లాడుతూ ప్రయివేట్ ఆస్పత్రులకు ధీటుగా కంటి పరీక్ష నిర్వహించి కళ్లద్దాలు ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిఒ శ్రీదేవి, ఎఎన్ఎంలు విజయకుమారి, రాధాపాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆర్‌టిపిపి నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని ఎపి జెన్కో ఎండి చక్రధర్ బాబును జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి సి.భూపేష్ సుబ్బరామిరెడ్డి కోరారు. మంగళవారం విజయవాడలో ఎండి కార్యాలయం లో ఎమ్మెల్యే , భూపేష్‌రెడ్డి రైతులతో కలిశారు. స్థానికంగా ఉన్న వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

చాపాడు : చిన్నగురువలూరులో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎఒ మ్యాగీ మాట్లాడుతూ రైతులు అందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పక చేయించుకోవాలని సూచించారు. రైతులకు ఒక ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నట్లు తెలిపారు. తద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్బిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు పొందుతారన్నారు. సాగులో ఉన్న పొలాలను పరిశీలించి సూచనలిచ్చారు.

రతనాలసీమగా మార్చేందుకు ప్రయత్నించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : రాయలసీమను రతనాలసీమగా మార్చే ప్రయత్నం స్థానిక ప్రజాప్రతినిధులే బాధ్యతగా తీసుకోవాలని ఈ నెల 9న ప్రొద్దుటూరులో ఉమ్మడి కడప జిల్లాస్థాయి చర్చా వేదిక నిర్వహిస్తున్నామని ఎపి రాష్ట్రాభివృద్ధి వేదిక స్టేట్ కన్వీనర్ గంజికుంట నాగరాజు తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆయన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రాయలసీమను కరువు సీమగా ప్రకటించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రత్యేక బడ్జెట్‌తో సీమకు 60 శాతం బడ్జెట్ అన్ని రంగాల్లో కేటా యించాలన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు ఎవి రమణ, అభివృద్ధి వేదిక సభ్యులు రామానుజన్‌రెడ్డి, గన్న పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలపై భర్తతో గొడవపడిన వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన మంగళవారం రామసముద్రం మండలంలో జరిగింది. ఎస్ఐ రవికుమార్ కథనం మేరకు.. మండలంలోని గాజుల నగర్‌కు చెందిన కళాకారుడు తిరుమలేష్ భార్య లక్ష్మీదేవి ఆర్థిక లావాదేవీల విషయమై గొడవ పడ్డారు. ఆగ్రహించిన తిరుమలేష్ భార్యను కొట్టాడు. తీవ్ర మనస్థాపానికి గురైన లక్ష్మీదేవి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.